# తెలంగాణ సచివాలయానికి గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ సర్టిఫికేట్

## ఈ ఘనత పొందిన తొలి సెక్రటేరియట్‌గా రికార్డు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌కు గ్రీన్ బిల్డింగ్ ఇండియా కౌన్సిల్ గోల్డ్ సర్టిఫికేట్ దక్కింది. పర్యావరణ హితంగా గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు పాటించినందుకు సర్టిఫికేట్‌ను ప్రధానం చేసింది. భారత్‌లో గోల్డ్ రేటెడ్ సర్టిఫికేట్ పొందిన తొలి సెక్రటేరియట్ బిల్డింగ్ కాంప్లెక్స్‌గా ఘనత సాధించింది. ఈ మేరకు సోమవారం సెక్రటేరియట్‌లో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చైర్మన్ శేఖర్‌రెడ్డి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి అవార్డును అందించారు. సచివాలయానికి సర్టిఫికేట్ రావడంపై మంత్రి వేముల హర్షం వ్యక్తం చేశారు. అత్యంత విశాలంగా, అధునాతన హంగులతో సెక్రటేరియట్‌ను పర్యావరణహితంగా నిర్మించామన్నారు. ప్రకృతి ప్రేమికుడైన సిఎం కెసిఆర్ చరవ వల్లే ఈ అవార్డు సాధ్యమైందన్నారు. సిఎం కెసిఆర్ చేపట్టిన హరితహారం కార్యక్రమంతో రాష్ట్రంలో ఇప్పటికే గ్రీనరీ 7.7 శాతం పెరిగిందన్నారు. సిఎం ఆలోచనలకు అనుగుణంగానే సెక్రటేరియట్ నిర్మాణం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసి ప్లాటినం అవార్డును సైతం గెలుచుకుంటామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

## విద్యుత్ మంత్రి జగదీశ్‌రెడ్డి



**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలిన ఆ శాఖ మంత్రి జి జగదీశ్‌రెడ్డి సూచించారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖకు జరిగిన నష్టాలపై హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం మంత్రి సమీక్షించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఇంజనీర్లు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ఈదురు గాలులతో చెట్టు విరిగి స్తంభాలపై పడటం వల్ల వైర్లు తెగిపోవడం వంటి సంఘటను చోటు చేసుకుంటాయని, వీటిని క్షేత్ర స్థాయిలో సిబ్బంది తక్షణం పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావాలన్నారు. ఇందులో విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# జలమండలికి ఉత్తమ యాజమాన్య అవార్డు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతుంది. ఇప్పటికే వాటర్ కన్జర్వేషన్, ఉత్తమ ఎస్‌టిపి లాంటి వాటిని గెలుచుకోగా, తాజాగా మరొక అవార్డు గెలుచుకున్నారు. తమ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకుంటున్న చర్యలు, మంచి పారిశ్రామిక సంబంధాలకు గానూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ యాజమాన్య పురస్కారాన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రకటించింది. ఈ అవార్డును ఎండి దానకిషోర్ రవీంద్రభారతో మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. కార్మికులకు భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్నారు.

### జలమండలి సిజిఎం మృతి, ఎండి నివాళి

జలమండలిలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా సేవలందించిన ఎంఎల్ ప్రసన్న కుమార్ ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన సంస్మరణ సభకు ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలోని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎండి దానకిషోర్, ఇంతర డైరక్టర్‌లు, సిజిఎంలు, జిఎంలు, డిజిఎంలు, ఇతర ఉద్యోగులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మేనేజర్లుగా జీవితాన్ని ప్రారంభించి, 35 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలు అందించారన్నారు. ఉద్యోగంతో పాటు ఇటు కుటుంబాన్ని రెండింటిని సమన్వయం చేసుకోవాలని సూచించారు. బోర్డులో ఆయన లోటు తీర్చలేదనిదన్నారు.

### ఇద్దరు జలమండలి ఉద్యోగుల పదవీవిరమణ

జలమండలిలో ఇద్దరు ఉద్యోగులు పదవి విరమణ చేశారు. సోమవారం ఖైరతాబాద్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోల పలికారు. ఈ కార్యక్రమంలో పి అండ్ ఏ సిజిఎం మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జిఎంలు సరస్వతితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీపై కాంగ్రెస్ నేతల అనుచిత వ్యాఖ్యలు సరికాదు

## బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు డికె అరుణ



**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** దేశ ప్రధాని నరేంద్రమోడిపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ తీవ్రంగా ఖండించారు. ఈ విషయంలో కర్నాటక ఎన్నికల ప్రచారంలో ఉన్న డికె అరుణ ఖండించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నాటక ఎన్నికల్లో భాగంగా గుల్బర్గా జిల్లా చిట్టాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక ఖర్గే దేశ ప్రధాని నరేంద్రమోడిపై నోటికి వచ్చినట్టు వ్యాఖ్యలు చేసినంత మాత్రాన మోడికి నష్టం ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలను మెప్పించలేక, ఒప్పించలేక మోడిపై అక్కసును కక్కుతున్నారన్నారు. ఇది దేశ ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులుఎంత తనపై నోరు పారేసుకున్నా వాటిని తాను ఆశీర్వాదంగా స్వీకరిస్తానని మోడీ అనడం, తనకున్న పెద్ద మనసుకు నిదర్శనం అంటూ కొనియాడారు.

# ప్రజలకు, పాలకుల మధ్య వ్యత్యాసం నామమాత్రం

## టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ప్రజల నుంచి పాలకులగా ఎన్నుకోబతారని, ప్రజలకు, పాలకుల మధ్య వ్యత్యాసం నామమాత్రంగా ఉంటుందన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు, పాలకులకు మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉందని, ప్రజల గత కాంగ్రెస్ ప్రభుత్వాలలో ఉన్నట్లుగా సిఎం నివాసం ప్రగతి భవన్‌కు, కొత్త సచివాలయానికి చేరుకోలేదన్నారు. స్వాతంత్ర్యం ముందు రాజులు పెద్ద రాజు భవనాలలో పాలనను ఉపయోగించారు. కానీ ప్రజలను ప్యాలెస్‌లకు అనుమతించలేదన్నారు. కొత్త సచివాలయం సందర్భంగా వాగాధనం చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను అందించాలని, పరిష్కారానికి ప్రగతిభవన్‌లో, కొత్త సచివాలయానికి అనుమతించాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు.

# వచ్చే వానకాలంలో 1.54 కోట్ల ఎకరాల్లో సాగు

## • వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** రానున్న వానాకాలం సీజనులో తెలంగాణలో 1.54 కోట్ల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు చేస్తారని అంచనా వేస్తున్నట్లు ఆ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇందులో 1.40 కోట్ల ఎకరాల్లో వరి, పత్తి తదితర పంటలు, మరో 14 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతాయని చెప్పారు. ఇందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు సమాయుత్తం కావాలని సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం సమావేశం జరిగినట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వానాకాలంలో పత్తి, కంది సాగును మరింత ప్రోత్సహించనున్నామన్నారు. ఇందుకు అనుగుణంగా 18 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచుతామని వివరించారు. స్వల్ప వ్యవధిలో అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను అందుబాటులోకి తేవాలన్నారు. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నాను. ఎరువులు కూడా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటల సాగుకు ఎకరానికి 40 వేల రూపాయల పంట రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. నానో యూరియా, డీఏపీ ఎరువుల వాడకాన్ని విస్తృతం చేయాలన్నారు. అలాగే మార్చి చివరి నాటికి యాసంగి కోతలు పూర్తి చేస్తే వడగళ్ల నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ఇందులో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్య కార్మికులకు రూ.1000 వేతనం పెంపు

**వేతనాల పెంపు తక్షణమే అమలు, ఉత్తర్వులు జారీ**
**త్వరలో ఆర్టీసి కార్మికులకు వేతనాలు పెంచుతాం**
**కార్మికులకు గుడ్‌న్యూస్, సిఎం కెసిఆర్ మే డే కానుక**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** తెలంగాణలో పారిశుధ్య, ఆర్టీసి కార్మికులకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మే డే కానుక ప్రకటించారు. పారిశుధ్య, ఆర్టీసి కార్మికుల వేతనాలు పెంచాలని నిర్ణయించారు. ఈ మేరకు నూతన సచివాలయంలో జిల్లాల మంత్రులు, నేతలు, నీటిపారుదల శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో వేతనాలు పెంచుతూ సిఎం కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారు. మేడే కానుకగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,06,474 మంది పారిశుద్ధ్యం కార్మికులకు వేతనాలను నెలకు తలా రూ.1000(వెయ్యి) చొప్పున పెంచాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు. జిహెచ్‌ఎంసీ, మెట్రో వాటర్ వర్క్స్‌తో పాటు రాష్ట్రంలోని మున్సిపల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పనిచేస్తూ ప్రస్తుతం జీతం అందుకుంటున్న పారిశుధ్య కార్మికులందరికీ నెల నెలా పెరిగిన వేయి రూపాయల వేతనం అదనంగా జీతంతో పాటు కలిపి అందుతుందని సిఎం తెలిపారు. పెరిగిన వేతనాలు తక్షణమే అమలులోకి వస్తాయని సిఎం తెలిపారు. అలాగే త్వరలోనే ఆర్టీసి కార్మికుల వేతనాలు కూడా పెంచాలని సిఎం నిర్ణయించారు. ఈ మేరకు వేతనాల పెంపునకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేశారు.

### సఫాయన్న నీకు సలాం: కెసిఆర్

ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ మాట్లాడుతూ సఫాయన్న నీకు సలాం అన్న అనే నినాదంతో పారిశుధ్య కార్మికుల కృషిని, త్యాగాలను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి గుర్తిస్తూ వారి సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని సిఎం అన్నారు. రాష్ట్రంలో కష్టించి పనిచేసే ప్రతీ ఒక్క కార్మికుని సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. తెలంగాణ పల్లెలు, పట్టణాలు గుణాత్మక అభివృద్దిని సాధించడంలో పారిశుధ్య కార్మికుల శ్రమ గొప్పదన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన పల్లెలు, పట్టణాలకు అవార్డులు రావడం వెనుక వీరి కృషి దాగి ఉన్నదని సిఎం తెలిపారు. పల్లెలు, పట్టణాల్లో నాటి, నేటి పరిస్థితులకు ఎంతో స్పష్టమైన తేడా ఉన్నదని సిఎం అన్నారు. పారిశుధ్య కార్మికులు కూడా అదే కృతజ్ఞత భావంతో మనస్ఫూర్తిగా పని చేస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావడం పట్ల ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు.

### 1,06,474 మందికి పెరగనున్న జీతాలు

తెలంగాణ సఫాయి కార్మికులకు సిఎం కెసిఆర్ మే డే కానుక ప్రకటించారు. పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.1000 వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం లోగా జిఓ నెంబరు.39ని ప్రభుత్వం జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.06.474 మంది పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెరుగుతున్నాయి. దీంతో పారిశుధ్య కార్మికుల్లో హర్షం వ్యక్తం చేశారు. జీతాలు పెంచడంపై మంత్రి ఎర్రబెల్ల దయాకర్‌రావు సిఎం కెసిఆర్ మనస్సున్న మారాజు అంటూ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లకు మంత్రి ఎర్రబెల్లి కృతజ్ఞతలు, దన్యవాదాలు తెలిపారు. పల్లెలు, పట్టణాలు అభివృద్ధి సాధించడంలో పారిశుధ్య కార్మికు శ్రమ ఎంతో ఉందన్నారు. జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం వెనుక పారిశుధ్య కార్మికుల కృషి ఉందన్నారు.

# 7,650 మెగావాట్లకు పడిపోయిన విద్యుత్ డిమాండ్

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యుత్ వినియోగం భారీగా తగ్గింది. సగానికి పైగా డిమాండ్ పడిపోవడం విశేషం. దాదాపు పదిహేను రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పాటు, యాసంగి సీజను ముగిసి పంటలు చేతికొస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం క్రమేపీ తగ్గిపోయింది. ఆదివారం రాత్రి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగం 7650 మెగావాట్లకు పడిపోయింది.

అదే ఏప్రిల్ నెల 12వ తేదీన రాష్ట్రం మొత్తం మీద 13159 మెగావాట్ల మేర విద్యుత్ వినియోగం నమోదైంది. విద్యుత్ శాఖ వివరాల ప్రకారం ఏప్రిల్ 17వ తేదీకి 12708 మెగావాట్లు, 19వ తేదీకి 12674 మెగావాట్లు, 20వ తేదీకి 12322 మెగావాట్లు, 21వ తేదీకి 11374 మెగావాట్లు, 22వ తేదీన 10196 మెగావాట్లు, అక్కడ నుండి మరింత విద్యుత్ వినియోగం తగ్గిపోయింది.

23వ తేదీన 9217 మెగావాట్లు, 24వ తేదీన 9894 మెగావాట్లు, 25వ తేదీన 9691 మెగావాట్లు, 26వ తేదీన 8191 మెగావాట్లు, 27వ తేదీన 8623 మెగావాట్లు, 28వ తేదీన 8615 మెగావాట్లు, 29వ తేదీన 7799 మెగావాట్లు, ఏప్రిల్ 30వ తేదీన 7650 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డయింది. కాగా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా మార్చి నెల 30వ తేదీన రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం జరిగింది.

ఉదయం 11.01 గంటలకు 15497 మెగావాట్ల మేర అత్యధిక పీడ్ డిమాండ్ ఏర్పడింది. అదే నెల ప్రారంభం నుంచే 13 వేల నుండి 15 వేల మెగావాట్ల వరకూ ఒకరోజు ఎక్కువ, మరో రోజు తక్కువగా విద్యుత్ వినియోగం రికార్డవుతూ వస్తోంది.

కాగా రాష్ట్రంలో గత 20 రోజుల నుండి వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీంతో గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో అకాల వర్షాలు, ఈదురు గాలులతో కూడి వడగండ్ల వానలు కురుస్తున్నాయి. దీంతో వేసవి ఉష్ణోగ్రతలు పడిపోయి విద్యుత్ వినియోగం తగ్గిపోయింది. మరోపక్క యాసంగి సీజను ముగియడంతో వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ వాడకం పడిపోయింది.

## నేరాల విచారణ వేగవంతం, శీఘ్రంగా శిక్షల కోసం

# పోలీసు విభాగం పునర్విభజన

## ఉన్నతాధికారులతో కొత్వాల్ సమీక్ష

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** జంట నగరాల్లో నేరాల నివారణ, కేసుల విచారణ మరింత వేగవంతం చేయడం, నేరగాళ్లకు త్వరితగతిన శిక్షలు పడేలా చేయ డం వంటి అంశాలతో పాటు సిటీ పోలీసు విభాగాన్ని పునర్విభజన చేసే అంశంపై కొత్వాల్ ఆనంద్ సోమవారం ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. అద నపు పోలీసు కమిషనర్లు విక్రం సింగ్ మాన్ (శాంతి భద్రతలు), సుధీర్ బాబు (ట్రాఫిక్), ఏ.ఆర్ శ్రీనివాస్ (క్రైం అండ్ సి ట్), జాయింట్ పోలీసు కమిషనర్లు గజారావు భూపాల్ (కో..ఆర్డినే షన్), పరిమళ హన్నా నూతన్ (పరిపాలన), విశ్వప్రసాద్ (స్పెషల్ బ్రాంచి), శ్రీనివాసులు (సాయుధ బలగం) తదితరులు పా ల్గొన్న ఈ సమావేశంలో కమిషనర్ ఆనంద్ పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నగరంలో నేరాల నివారణకు మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవా లని, నేరగాళ్లను వెంటనే పట్టుకోవడంతో పాటు వారికి వీలైనంత త్వరంగా శిక్షలు పడేలా చేయాలని ఆయన ఆదేశించారు. దీంతో పాటు జంట నగరాలలో కొత్తగా ఏ ర్పాటైన ఏసిపి జోన్లు, పోలీసు స్టేషన్లకు సిబ్బందిని కేటాయించడం, వాహనాలను సమకూర్చడం వంటివి వేగంగా చేయాలని, వీటికి నూతన భవనాల ఏర్పాటుకు చ ర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ముఖ్యమైన వేడుకల్లో డ్రోన్లను వాడడం, సిసి కెమెరాలను మరింత పగడ్బందీగా వినియోగించడంపైనా దృష్టి సారించాలని ఆనంద్ ఆదేశించారు. పోలీసులు విధి నిర్వహణలో ఎంత ఒత్తిడులు ఎదుర్కొన్నా ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆయా జోన్ల డిసి పిల తో పాటు ఎసిపిలు ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు.



సిటీ పోలీసు ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న కొత్వాల్ ఆనంద్

# వేసవి విద్యుత్ కోసం 156 మిలియన్ టన్నుల బొగ్గు

**2023-24 వార్షిక లక్ష్యం 821 మిలియన్ టన్నులు**
**పూర్తిస్థాయి ఉత్పత్తికై థర్మల్ ప్లాంట్లకు కొరత లేకుండా చర్యలు**
**దేశీయ బొగ్గులో 610 మిలియన్ టన్నులపై కోల్ ఇండియా దృష్టి**

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవిలో విద్యుత్ ఉత్పత్తికి కొరత రాకుండే ఉండేందుకు గాను కోల్ ఇండియా ఏర్పాట్లు చేసింది. వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుండగా, మరోపక్క పారిశ్రామిక అవసరాల కోసం వినియోగం పుంజుకోవడంతో విద్యుత్, బొగ్గు మంత్రిత్వ శాఖలు అప్రమత్తమాయ్యాయి. విద్యుత్ రంగం నుండి పెరుగుతున్న డిమాండ్‌ను అధికమించేందుకు జూన్ 15వ తేదీ వరకూ థర్మల్ పవర్ ప్లాంట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వాటికి అవసరమైయ్యే బొగ్గు సరఫరాను కూడా కొరత లేకుండా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2023-24 తొలి త్రైమాసికం ఏప్రిల్ నుండి జూన్ నెల వరకూ 156 మిలియన్ టన్నుల మేర బొగ్గును అందుబాటులో ఉంచుతోంది.

దేశ వ్యాప్తంగా విద్యుత్‌కు క్రమేపీ డిమాండ్ పెరుగుతుండటంతో అందుకు అనుగుణంగా ఉత్పత్తి సంస్థలు థర్మల్ ప్లాంట్లకు ఇంధనం కొరత లేకుండా ఈ బొగ్గును సరఫరా చేస్తున్నట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు మొత్తంగా దేశీయంగా 610 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేయాలనే లక్ష్యంగా కలిగి ఉంది. తొలి అంచనాల్లో వార్షిక లక్ష్యం 590 మిలియన్ టన్నులుగా పేర్కొనగా, ప్రస్తుతం విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతుండటంతో దానికి అదనంగా మరో 20 మిలియన్ టన్నుల మేర పెంచి మొత్తంగా 610 మిలియన్ టన్నుల లక్ష్యానికి పెంపుదల చేసింది. 2023-24లో విద్యుత్ రంగానికి అంచనా వేయబడిన మొత్తం 821 మిలియన్ టన్నుల దేశీయ బొగ్గు డిమాండ్‌లో కోల్ ఇండియా లక్ష్యం మాత్రమే దాదాపు మూడు వంతుల మేర 610 మిలియన్ టన్నులగా ఉంది. ఇందులో తొలి త్రైమాసికమైన ఈ వేసవి సీజనులో 25.6 శాతం మేర 156 మిలియన్ టన్నులను సరఫరా చేస్తోంది. ఇదే సమయంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా థర్మల్ ప్లాంట్ల ప్రారంభ లక్ష్యం 565 మిలియన్ టన్నులుగా ఉంది. కాగా దేశీయ బొగ్గు ఉత్పత్తిలో 80 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్న కోల్ ఇండియా లిమిటెడ్ థర్మల్ పవర్ ప్లాంట్లకు సరిపడా బొగ్గును సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రైవేటు వాషరీలు, గూడ్స్ షెడ్‌లు, ఓడరేవులు, క్యాప్టివ్ మైన్స్‌లో దాదాపు 12 మిలియన్ టన్నుల బొగ్గు ఉండగా, రన్‌లో ఉన్న రేక్‌లు, అంటే రవాణాలో 2 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా జరుగుతోంది. గత సంవత్సరం 92.7 మిలియన్ టన్నులతో పోలిస్తే అదే వనరుల నుండి బొగ్గు లభ్యత 22.3 మిలియన్ టన్నులు ఎక్కువగా ఉందని అధికవర్గాలు పేర్కొంటున్నాయి. మరోపక్క ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి విద్యుత్ ప్లాంట్లకు కనీసం 115 మిలియన్ టన్నుల మేర దేశీయ బొగ్గు అందుబాటులో ఉంటుందని అంచనా. కోల్ ఇండియా పిట్‌హెడ్‌ల వద్ద 68 మిలియన్ టన్నులు, థర్మల్ ప్లాంట్ల వద్ద 32 మిలియన్ టన్నుల చొప్పున బొగ్గు నిల్వ ఉండవచ్చని లెక్కకడుతున్నాయి.

# నాలుగు నెలల్లో 50 కిడ్నీ మార్పిడి సర్జరీలు

## అవయవ దానంలో తెలంగాణ అగ్రస్థానం

## నిమ్స్ వైద్యులను అభినందించిన మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 4 నెలల్లో 50 కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌లు చేసి.. వారికి పునర్జన్మను ప్రసాదించిన నిమ్స్ వైద్యులను వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అభినందించారు. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనంలో అత్యంత ఖరీదైన వైద్యం పేదలకు చేరువయ్యిందని, తద్వారా అనేకమంది అవయవ మార్పిడి బాధితులకు పునర్జన్మ లభిస్తుందన్నారు. గాంధీ ఆసుపత్రిలో రూ. 35 కోట్లతో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ ఏర్పాటు చేసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇది పూర్తయితే అవయవ మార్పిడి సేవలు మరింత విస్తృతం అవుతాయని చెప్పారు. ఆర్గాన్ డొనేషన్‌లో తెలంగాణ దేశంలోనే నంబర్ 1 స్థానంలో ఉందన్నారు. అవయవదానం ప్రోత్సహించి జీవన్‌దాన్‌లో నమోదు చేసుకొని ఎదురు చూస్తున్న వారికి నిండైన జీవితం అందించాలని పిలుపునిస్తున్నట్టు మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ ఏడాది గడచిన 4 నెలల్లో 50 మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సలను నిమ్స్ వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా సాధ్యంకాని ఈ ఘనతను నిమ్స్ వైద్యులు సాకారం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ప్రభుత్వ సహకారంతో రోగికి రూ. 15 లక్షల విలువైన ఉచిత చికిత్సను ప్రభుత్వం అందిస్తున్నది. నిమ్స్‌తోపాటు గాంధీ, ఉస్మానియాల్లో గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, పాంక్రియాస్, చర్మం, కార్నియా, ఎముక కణజాలం, గుండె కవాటాలు, రక్త నాళాల మార్పిడి సర్జరీలను ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి నిమ్స్ హాస్పిటల్‌లో ఇప్పటి వరకు 862 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగాయి. వాటిలో 522 లైవ్.. 340 కాడవర్ కేసులున్నాయి. 2015 నుంచి ప్రతి సంవత్సరం సగటున 100 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగాయి.

# సచివాలయ కొత్త భవనానికి ఎపి జిఒ జెఎసి అభినందనలు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** తెలంగాణ సచివాలయ కొత్త భవనంపై ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ అధికారుల జాయింట్ యాక్షన్ కమిటీ (ఎపిజీవోజేఏసీ) హర్షం వ్యక్తం చేసింది. కొత్త భవాన్ని విజయవంతంగా ప్రారంభించినందుకుగాను తెలంగాణలోని తమ సహచర అధికారులకు అభినందనలు తెలిపింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఎపి గెజిటెడ్ ఆఫీసర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ కెవి కృష్ణయ్య ఒక ప్రకటనలో ఈ మహత్తర కార్యక్రమం తెలంగాణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. ఈ గొప్ప ఘనతను సాధించడంలో మీరు, మీ తెలంగాణ ప్రభుత్వం యొక్క అంకితభావం, నిబద్ధత ప్రశంసనీయమని వ్యాఖ్యానించారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని సాధ్యం చేయడంలో మీరందరూ చేసిన కృషిని తాము గుర్తించామని కొనియాడారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రజలకు సాధ్యమైనంత ఉత్తమమైన సేవలను అందించడానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వ సేవకుల సంఘంలో భాగమైనందుకు తాము గర్విస్తున్నామని పేర్కొన్నారు.

# ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారంపై వారం రోజుల్లో పరిష్కారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 1:** ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పరిహారం లభించని వైనంపై వారం, పది రోజుల్లో విచారణ జరిపి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం చెగ్యాం గ్రామానికి చెందిన నిర్వాసితులు సోమవారం సచివాలయంలో ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్‌తో చర్చించి వారి విషయంపై పూర్తి వివరాలను మంత్రి తెలుసుకున్నారు. భూసేకరణ చట్టం ప్రకారం భూమి హక్కు పట్టాలు ఇచ్చినప్పటికీ... ఇళ్ల నిర్మాణానికి నిధులు రాలేదని నిర్వాసితులు తెలిపారు. సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారు తప్ప తమకు న్యాయం జరగలేదని వాపోయారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినప్ప టికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
స్వల్పకాలిక వేలం ప్రకటన

లేఖ సంఖ్య: 1412/2022/ఎస్6, తేదీ: 29.04.2023
అటవీశాఖ నిర్మల్ జిల్లాలో దిమ్మదుర్తి రేంజ్ పరిధిలో తుర్కం చెరువు మరియు దాని చుట్టుప్రక్కల సమగ్ర అభివృద్ధి కోసం కన్సల్టెంట్‌ని నియమించడం కోసం కొటేషన్ (RFQ) కోసం గాను ఆసక్తి గల కాంట్రాక్టర్స్/సంస్థల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుతున్నవి. ఈ కార్యాలయములో సమర్పించే తేదీ: 02.05.2023 నుండి 10.05.2023 వరకు కార్యాలయపు పని వేళలలో టెండర్ పత్రం స్వీకరించగలరు. మిగతా వివరములకు మరియు నిబంధనల కొరకు జిల్లా అటవీ అధికారి, నిర్మల్ కార్యాలయము నందు లేదా ఫోన్ నెంబరు యందు సంప్రదించగలరు. (9346679091).
సం/-. జిల్లా అటవీఅధికారి, నిర్మల్
DIPR.No.222-DP/CL/Advt/1/2023-24 తేదీ:01.05.2023

